www.vishalabharati.com
epaper:vishalabharati.com
TELANGANA POLITRICKS
పాలిట్రిక్స్
2023-2024
విశాల భారతి
vishalabharathi Telugu Daily
ఆదివారం, 04.11.2023
హైదరాబాద్
1pm edition

పాలిట్రిక్స్

'నామినేషన్ డిపాజిట్ 'నల్గొండ' నే పెంచింది!

1996 ఎన్నికల తర్వాత సంస్కరణ

జల సాధన సమితి దెబ్బకు పెరిగిన రుసుము

విశాల భారతి, హైదరాబాద్:

ఎన్నికలు అనగానే ఓట్ల కోసం వచ్చే నేతల వద్ద తమ డిమాండ్లను పెట్టి సాధించుకుంటారు. కొన్ని సందర్భాల్లో సమస్యలపై నిరసనను కూడా వ్యక్తం చేస్తుంటారు. తమ డిమాండ్లు, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు కొందరు ఎన్నికలను వేదికగా చేసుకుంటారు. ఇందులో భాగంగానే భారీగా నామినేషన్లు వేస్తూ తమ నిరసనను తెలుపుతుంటారు. అయితే నామినేషన్ వేసే సమయంలో అభ్యర్థులు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అసెంబ్లీకి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్‌తో పాటుగా జనరల్, బీసీ కేటగిరీకి చెందిన అభ్యర్థులు రూ. 10 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ. 5 వేల చొప్పున నామినేషన్ రుసుం (డిపాజిట్) చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అదే చెల్లిస్తున్నారు. నిజానికి ఒకప్పుడు ఈ నామినేషన్ డిపాజిట్ చాలా తక్కువగా ఉండేది. అయితే ప్రస్తుతం డిపాజిట్ ధరను భారీగా పెంచేశారు. ఇంతకీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల డిపాజిట్ పెంపునకు కారణమెంటీ?

ఉమ్మడి నల్గొండ జిల్లాను దశాబ్దాల పాటు ఫ్లోరైడ్ భూతం పట్టి పీడించింది. ఫ్లోరైడ్ భూతం నుంచి జిల్లాను కాపాడాలంటూ జల సాధన సమితి ఎన్నో ఆందోళనలు చేపట్టింది. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేసి ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు తాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను పాలకుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఎన్నికలను వేదికగా చేసుకుంది జల సాధన సమితి.

1996లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో..

1996లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో జల సాధన సమితి వందలాది మంది ఫ్లోరైడ్ బాధితులు, రైతులు, ఉద్యమ కార్యకర్తలతో నల్గొండ లోక్‌సభ ఎన్నికల్లో నామినేషన్లు వేయించింది. ఈ ఎన్నికలో 537 నామినేషన్లు దాఖలు కాగా, స్క్రూటినీ తర్వాత 480 మంది బరిలో మిగిలారు. ఇందులో ఆరుగురు మాత్రమే రాజకీయ పార్టీల అభ్యర్థులు కాగా, 386 మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులున్నారు.

చాలా మంది అభ్యర్థులు బరిలో నిలవడంతో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు సమయం సరిపోకపోవడంతో పోలింగ్ ను నెల రోజులపాటు ఎన్నికల సంఘం వాయిదా వేసింది. 480 గుర్తులతో బుక్ లెట్ సైజులోబ్యాలెట్ పత్రం రూపొందించారు. ఇందుకు అనుగుణంగా బ్యాలెట్ బాక్స్‌లు ప్రత్యేకంగా భారీ ఆకారంలో తయారు చేయించారు. 1996 మే 27న ఎన్నికలు నిర్వహించారు. ఈ ఓట్లను లెక్కించేందుకు రెండు రోజుల సమయం పట్టింది. 477 మంది అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. నల్గొండ లోక్‌సభకు నిర్వహించిన ఈ ఎన్నిక జాతీయ స్థాయిలో చర్చకు, ఎన్నికల సంస్కరణలకు దారి తీసింది.

నామినేషన్‌కు డిపాజిట్ పెంపు..

సాధారణంగా లోక్‌సభకు పోటీ చేయడానికి డిపాజిట్‌గా సాధారణ అభ్యర్థులు రూ.500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.250, శాసనసభ సభ్యుడిగా పోటీ చేయడానికి సాధారణ అభ్యర్థులు రూ.250, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.125 చెల్లించాల్సి ఉండేది. 1996లో నల్గొండ లోక్‌సభ స్థానానికి భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడంతో ఎన్నికల కమిషన్ సంస్కరణలు తెచ్చింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో నామినేషన్ ఫీజును లోక్‌సభకు జనరల్ అభ్యర్థులకు రూ.500 నుంచి రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250 నుంచి రూ.12,500, శాసనసభకు జనరల్ అభ్యర్థులకు రూ.250 నుంచి రూ.10వేలకు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.125 నుంచి రూ.5000కు పెంచింది. అప్పటి నుంచి పెంచిన డిపాజిట్‌ను అభ్యర్థులు చెల్లిస్తున్నారు.



ఇవాళ కాంగ్రెస్ థర్డ్ లిస్ట్!

- కమ్యూనిస్టులతో పొత్తుపై వీడిన సందిగ్ధత
- ఈ నెల 8న కామారెడ్డిలో రేవంత్ రెడ్డి నామినేషన్
- నిజామాబాద్ అర్బన్ నుంచి షబ్బీర్ అలీ
- 9న అక్కడే భారీ బహిరంగ సభ, మైనారిటీ డిక్లరేషన్

విశాల భారతి, హైదరాబాద్:

కాంగ్రెస్‌పార్టీ థర్డ్‌లిస్ట్ ఇవాళ విడుదలయ్యే అవకాశాలున్నాయి. కమ్యూనిస్టులతో పొత్తుపై సందిగ్ధత వీడడంతో అన్ని స్థానాలకు సంబంధించిన వివరాలను ఇప్పటికే సెంట్రల్ ఎలక్షన్ కమిటీకి అందజేసినట్టు పార్టీ నేతలు చెప్తున్నారు. దీనికి సంబంధించి పార్టీ రాష్ట్ర నేతలతో ఒకసారి జూమ్‌లో సమావేశమై చర్చించాక నేడు మిగతా స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే చాన్స్ ఉన్నది. కామారెడ్డి, నిజామాబాద్ అర్బన్ స్థానాలు దాదాపు ఖరారైపోయిన నేపథ్యంలో.. మిగతా 17 స్థానాలపైనే కాంగ్రెస్ నేతల్లో ఉత్కంఠ నెలకొన్నది. సీపీఐ కి కొత్తగూడెం సీటు, ఒక ఎమ్మెల్సీ దాదాపు ఖరారు అయిన నేపథ్యంలో, సీపీఎం కూడా ఇప్పటికే తాను పోటీ చేసే స్థానాలను ప్రకటించడంతో మిగతా అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లే ప్రకటించే అవకాశం ఉంది.

కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి పోటీ..

పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కామారెడ్డిలో సీఎం కేసీఆర్ పై పోటీ చేయనున్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు రేవంత్ కొడంగల్‌తో పాటు కేసీఆర్ పోటీ చేయనున్న కామారెడ్డి స్థానం నుంచి కూడా బరిలోకి దిగనున్నారు. శనివారం గాంధీభవన్‌లో నిజామాబాద్ జిల్లా నేతలతో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ సెక్రటరీలు, పీసీసీ చీఫ్‌రేవంత్, షబ్బీర్ అలీ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భాగంగా కామారెడ్డి బరిలో రేవంత్ ఉంటారని ఠాక్రే స్పష్టం చేసినట్టు తెలిసింది. ఏఐసీసీ ఆదేశాల నేపథ్యంలో ఈ నెల 8న కామారెడ్డిలో రేవంత్ నామినేషన్ వేయనున్నట్టు తెలుస్తున్నది. శుక్రవారం కొడంగల్ లో తొలి సెట్ నామినేషన్ వేసిన రేవంత్‌రెడ్డి.. సోమవారం రెండో సెట్ నామినేషన్‌వేయనున్నారు. ఇక, రేవంత్ కామారెడ్డి బరిలో ఉంటుండటంతో షబ్బీర్‌అలీ నిజామాబాద్ అర్బన్ నుంచి బరిలోకి దిగనున్నారు. నేడు షబ్బీర్ అలీ ఆ నియోజకవర్గ నాయకులతో సమావేశం కానున్నారు. నామినేషన్ ఎప్పుడు వేసేదీ అప్పుడే తేల్చనున్నారు. షబ్బీర్ అలీ నామినేషన్‌కు పీసీసీ చీఫ్ రేవంత్ కూడా వెళ్తారని సమాచారం. మరోవైపు ఈ నెల 9న నిజామాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలుస్తున్నది. అక్కడే మైనారిటీ డిక్లరేషన్ ప్రకటిస్తారని చెప్తున్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సల్మాన్ ఖుర్షీద్ హాజరు కానున్నట్టు సమాచారం.

విజయం 'వజ్రేశ్' దే..!

మేడ్చల్‌లో 'తోటకూర'దే హవా

పాదయాత్రలో తిరుగులేని జనాదరణ

అడుగడుగునా ప్రజల ఆశీర్వాదం

బీఆర్ఎస్ పై వ్యతిరేకతే కాంగ్రెస్‌కు బలం

విస్తరిస్తున్న మౌత్‌టాక్‌తో క్యాడర్‌లో జోష్

'చామకూర' కు అంతటా ఎదురుగాలి

పెయిడ్‌క్యాంపెయిన్‌తో జనం అసహనం

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ హవా కొనసాగుతోంది. రాష్ట్రంలో వరుసగా పదేండ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి ప్రజా వ్యతిరేకత ఉండడంతో పాటు మేడ్చల్ ఎమ్మెల్యేగా ఉన్న మల్లారెడ్డిపై అనేక ఆరోపణలు, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదనే అపవాదు కలిసి 'చామకూర'కు ఎదురుగాలి వీస్తోంది. దీనికి తోడు నిన్నమొన్నటి దాకా బీఆర్ఎస్ లోనే కొనసాగిన నియోజకవర్గంలోని కీలక నేతలు మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ లతో పాటు ఉద్యమంలో కీలకంగా పనిచేసిన వేలాది మంది బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మల్లారెడ్డికి వ్యతిరేక పవనాలు..

మేడ్చల్ ఎమ్మెల్యేగా, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్న చామకూర మల్లారెడ్డి నిరంతరం ఏదో ఒక విధంగా వార్తల్లో ఉండడం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. ఈ విషయంలో అతనిపై అనేక సెటైరికల్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ట్రోల్ అవుతున్నాయి. అదే విధంగా మల్లారెడ్డిపై అనేక ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా మూడు చింతలపల్లి మండల పరిధిలోని ఓ గ్రామంలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారి అసైన్డ్ భూములను అప్పనంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడనే ఆరోపణలు చాలా వచ్చాయి. అంతే కాకుండా ఆయన బంధు మిత్రులు కూడా దేవరయంజాల్ లోని ఎండోమెంట్ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఇవే కాకుండా సొంత పార్టీ నేతలకు కార్పొరేషన్, కౌన్సిలర్, ఎంపీటీసీ సీట్ల కోసం కోట్లాది రూపాయలు వసూళ్లు చేశారనే ఆరోపణలు సామాజిక మాధ్యమాలలో ఒక ట్రెండ్ నే సృష్టించాయి. అవన్నీ అలా ఉంచితే సొంత పార్టీ నాయకులపై, ప్రజాప్రతినిధులపై నోరు జారడం, వర్గాలను పెంచి పోషించడం విభేదాలు కల్పించడం లాంటి విమర్శలు మల్లారెడ్డిపై అనేకం ఉన్నాయి. అతడి ఇంటిపై, విద్యా సంస్థలపై ఐటీ సంస్థ వారు దాడులు చేసిన సందర్భంలో మల్లారెడ్డి చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. అనేక చోట్ల అదాయపు పన్ను ఎగ్గొట్టారనే ఆరోపణలు, మెడికల్ కాలేజ్ లో అవకతవకలు లాంటి ఆరోపణలపై కేసులు నమోదు కావడం లాంటివి కూడా ఆయనకు వ్యతిరేకతను పెంచే అవకాశం ఉంది.

ఏకపక్ష నిర్ణయాలతో దూరమవుతున్న క్యాడర్..

మల్లారెడ్డి మంత్రి అయ్యాకా నియంతృత్వ పోకడలను సాగిస్తున్నారని, పార్టీ నిర్మాణం కోసం కష్టపడిన వారిని పక్కన పెట్టారని, ఆయనకు రాజకీయమంటే విద్యాసంస్థల వ్యాపారంలాగా మారిందనే విమర్శలు ఉన్నాయి. మల్లారెడ్డి వ్యవహార శైలి నచ్చకనే గతంలో ఘట్‌కేసర్ ఎంపీపీగా ఉన్న ఏనుగు సుదర్శన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేసి బీజేపీ లో చేరారు. అదే విధంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన 6 మంది కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్ వేలాది మంది కార్యకర్తలతో కాంగ్రెస్‌చేరారు. అంతే కాకుండా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని అనేక వేదికలపై తీవ్రంగా అవమానాల పాలు చేశారని సుధీర్ రెడ్డి అందుకే పార్టీ మారారని వాదనలూ ఉన్నాయి. నియోజకవర్గం మొత్తం బీఆర్ఎస్ పార్టీ కాకుండా మల్లారెడ్డి కుటుంబానిదే పెత్తనం నడుస్తోందని సీనియర్ నాయకులు సూచనలు, సలహాలు ఏనాడూ కూడా పరిగణలోకి తీసుకోరనే వాదనలు ఉన్నాయి. ఈ మధ్య కాలంలో మంత్రి కోడలు ప్రీతి రెడ్డి ఒక కార్పొరేషన్ కు చెందిన అధ్యక్షుడిపై చిరు బుర్రులాడడంతో అతను తీవ్ర మనస్తాపానికి గురి కావడంతో మంత్రి అతనిని బుజ్జగించారని తెలిసింది. ఇవన్నీ మనసులో పెట్టుకున్న సీనియర్ నాయకులు, కొంతమంది ప్రజాప్రతినిధులు లోలోపల మదనపడుతూనే అయిష్టంగా పార్టీలో కొనసాగుతూ సమయం వచ్చినప్పుడు బ్లాస్ట్ కావాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

వజ్రేశ్‌యాదవ్‌కు జన నీరాజనం

మేడ్చల్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీలో ఉన్న తోటకూర వజ్రేశ్‌యాదవ్ కు మేడ్చల్ ప్రజలు అడుగు అడుగునా బ్రహ్మ రథం పడుతూ హారతులు ఇస్తూ ఆశీర్వదిస్తున్నారు. ముఖ్యంగా తోటకూర వజ్రేశ్‌యాదవ్ స్థానికుడు కావడం, గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలు కావడంతో వజ్రేశ్‌యాదవ్ పై ప్రజల్లో సానుభూతి ఉంది. గతంలో కంటే వజ్రేశ్‌యాదవ్ లో మంచి పరిణితి రావడం కూడా ఆయన విజయానికి కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు.

కలిసి రానున్న ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత

పోలింగ్ కు ఇంకా నెల రోజుల సమయం ఉన్నప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని పలు సర్వేలు, సామాజిక మాధ్యమాలలో జోరుగా చర్చలు జరుగుతుండడం మేడ్చల్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ కు శుభపరిణామంగా చెప్పవచ్చు. మేడ్చల్ నియోజకవర్గంలో అనేకమంది సెటిలర్లు నివాసం ఉంటారు. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ, వరంగల్ తో పాటు మహబూబ్ నగర్, మెదక్ జిల్లాల ప్రజలు అధికంగా ఉంటున్నారు. అయా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తుండడంతో ఇక్కడ కూడా కాంగ్రెస్ కే ఓటు వేస్తామనే చర్చ కూడా బలంగా జరుగుతుంది. అదే విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే మేడ్చల్ లో వజ్రేశ్‌యాదవ్ నే గెలిపించాలనే చర్చ కూడా అటు రెడ్డీల్లో రావడం వజ్రేశ్‌యాదవ్ కు కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు. ఏది ఏమైనా కొన్ని రకాల లోపాలను సరిదిద్దుకొని నాయకులంతా ఏకతాటిపై పని చేస్తే మల్లారెడ్డి ఓటమి ఖాయమనే సంకేతాలు నియోజకవర్గం ప్రజల్లోకి ఎప్పుడో పోయాయి.

అ నలుగురు ఒక్కటిగా..

గతంలో వేర్వేరు పార్టీలలో ఉంటూ ఎమ్మెల్యే ఎన్నికలలో ప్రత్యర్థులుగా పోటీ పడిన నలుగురు నాయకులు నేడు ఒకే గొడుగు కిందకు వచ్చారు. మల్లారెడ్డి ని ఎలాగైనా మేడ్చల్ నుంచి పంపించాలనే ఏకైక అజెండాతో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి,2009, 2018 లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన నక్క ప్రభాకర్ గౌడ్, మూడు చింతల పల్లి జడ్పీటీసీగా ఉన్న సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఏకతాటిపైకి వచ్చారు. తమ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ (జంగయ్య యాదవ్) ను ఎలాగైనా గెలిపించుకోవాలనే సంకల్పంతో సమష్టిగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. దీనికి తోడు నియోజకవర్గంలో దశాబ్దాలుగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోసం అహర్నిశలు పనిచేసిన అనేకమంది ఉద్యమ కారులు కూడా గులాబిని వీడి హస్తం అందుకుంటున్నారు.

ఫుల్ టెంపోతో ఖమ్మం అసెంబ్లీ ఫైట్!

మంత్రికి, మాజీ మంత్రి మధ్య హోరాహోరీ

'పువ్వాడ', 'తుమ్మల' మాటల యుద్ధం

పూట పూటకు కొత్త కొత్త ఆరోపణలు..

సవాళ్లు ప్రతి సవాళ్లతో రంజుగా అసెంబ్లీ ఫైట్

విశాల భారతి, హైదరాబాద్:

అబ్బబ్బ.. ఏమన్న మాటలా అవి.. ఖమ్మంలో ఆ రేంజ్ రాజకీయం జరుగుతుందని ఎవరూ ఊహించి ఉండరు. బీఆర్ఎస్‌పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లాను ఈ సారి చాలా ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అంతే ప్రెస్టేజియస్‌గా కాంగ్రెస్ పార్టీ కూడా సవాళ్లను స్వీకరిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అసలు ఖమ్మం నుంచి ఒక్క ఎమ్మెల్యేను కూడా అసెంబ్లీ గేటును తాకనివ్వబోమంటూ ఛాలెంజ్ విసిరింది. కాంగ్రెస్ సవాల్ కు కౌంటర్‌గా.. ఎలా ఆపుతారో చూస్తామంటూ బీఆర్ఎస్ ప్రతి సవాల్ చేయడం.. ఇలా రోజుకు మూడు పూటలా మాటల తూటాలు పేలుతున్నాయి. ఇద్దరు నేతలు ఇంతకీ ఎందుకంత ప్రెస్టేజ్‌కు పోతున్నారు...?

తెలంగాణ లో 119 నియోజకవర్గాలున్నా.. ఇంటెన్సివ్ పొలిటికల్ వార్ జరుగుతున్నది మాత్రం ఖమ్మంలోనే. మాటకు మాట, కౌంటర్ ఎన్‌కౌంటర్, అటాక్ రివర్స్ అటాక్.. ఇవన్నీ ఒక్క ఖమ్మం జిల్లాలోనే జరుగుతున్నాయి. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ భారం మొత్తం మోస్తున్నారనే చెప్పాలి. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే ఆయన. అందుకే, పువ్వాడ అజయ్ నుంచే కాంగ్రెస్‌కు ఎక్కువ కౌంటర్స్ వెళ్తున్నాయి. అటు ఖమ్మం జిల్లాను క్లీన్‌స్వీప్‌చేస్తామన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కూడా ఎక్కడా తగ్గడం లేదు. ఈ జిల్లాలో ద్విముఖ పోరే ఉండడంతో నిత్యం బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య నువ్వానేనా అనే రేంజ్‌లో సవాళ్లు ప్రతి సవాళ్లు వినిపిస్తున్నాయి. కాకపోతే, ఇదే కొంత శృతిమించినట్టు కనిపిస్తోంది. రాజకీయంగా ఆరోపణలు చేసుకోవాల్సిన వాళ్లు.. కాస్త వ్యక్తిగతంగానూ వెళ్తున్నట్టు కనిపిస్తోంది.

ఓల్డ్‌వెస్పా స్కూటర్'తుమ్మల'

'తుమ్మల' ఓల్డ్ వెస్పా స్కూటర్ అయితే.. తాను స్పోర్ట్స్ బైక్ లాంటి వాడిని. తాను పక్కా లోకల్, తుమ్మల నాన్ లోకల్. పువ్వాడ చేసిన ఈ కామెంట్స్ కొంతలో కొంత ఫర్వాలేదు. ప్రజలు వినడానికీ బాగానే ఉన్నాయి. కానీ అంతకు మించి మాట్లాడుకోవడమే ప్రజలను కాస్త ఇబ్బంది పెడుతోంది. తన వెంట నిఖార్సయిన యువకులు ఉంటే.. తుమ్మల వెంట రౌడీషీటర్లు, గంజాయి స్మగ్లర్లు ఉన్నారని పువ్వాడ కామెంట్ చేశారు. ఖమ్మంలో కొంతమంది సైకోలుగా మారి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడడం సంచలనం సృష్టించింది. రాబోయే రోజుల్లో ఖమ్మం సిటీలో సైకోల కోసం పిచ్చాసుపత్రి కట్టించి వారికి వైద్యం అందిస్తామన్నారు. అంత కుముందు అట్నుంచి వచ్చిన యాక్షన్‌ను బట్టే పువ్వాడ అజయ్ కుమార్ కూడా ఇలా రియాక్షన్ ఇచ్చారని చెప్పుకుంటున్నారు.

కేసీఆర్‌అవకాశం ఇచ్చారు..

2014లో తన చేతిలో ఓడిపోయిన తరువాత ఈ పదేళ్ల పాటు తుమ్మల ఎక్కడికి వెళ్లారో ఎవరికీ తెలీదని కౌంటర్స్ ఇచ్చారు. కరోనా టైంలో, వరదల సమయంలో ఖమ్మం ప్రజల గురించి ఆయన పట్టించుకున్నదే లేదన్నారు. తుమ్మలను పాలేరులో గెలిపిస్తే అక్కడకు వెళ్తారని, లేదంటే ఖమ్మం వస్తారన్నారు. ఆయనకు ఖమ్మం రెండో ప్రాధాన్యతని అన్నారు. కాని, పువ్వాడ కుటుంబం మాత్రం నిత్యం ఖమ్మం ప్రజలతోనే ఉంటూ ఖమ్మం జిల్లాను వదిలి పెట్టలేదన్నారు. తుమ్మల ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు ఖమ్మం జిల్లా ప్రజలకు ఏం చేశారో చెప్పాగలరా అని నిలదీశారు. అధికారాన్ని అనుభవించి ప్రజలను బూతు పురాణంతో భయపెట్టడం తప్ప తుమ్మల చేసిందేమీ లేదన్నారు. తన చేతిలో ఓడిపోయి మూలకు కూర్చుంటే.. కేసీఆర్ పిలిచి మంత్రి పదవి ఇచ్చారని డైరెక్ట్ అటాక్‌కు దిగారు. అసలు 40 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన వ్యక్తి.. ఇవాళ అదే కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్నారని, ఇదేనా ఆయన చెప్పే నీతి నిజాయితీ అని ప్రశ్నించారు. ఖమ్మం పోరు ఎలా ఉందంటే.. అప్పుడెప్పుడో హుజూరాబాద్, ఏడాది కింద మునుగోడులో ఇలాంటి ఫైట్ చూశాం. ఖమ్మం అసెంబ్లీ ఫైట్ వాటికి ఏమాత్రం తీసిపోని టెంపోతో నడుస్తోంది.

ఇసుకాసురుల భరతం పడతా..

అటు ఖమ్మం నియోజకవర్గం నుంచి బరిలో దిగుతున్న తుమ్మల నాగేశ్వరరావు కూడా దోస్ పెంచారు. పువ్వాడ అజయ్ టార్గెట్‌గా ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. పువ్వాడ ఆధ్వర్యంలో ఖమ్మంలో అరాచక రాజ్యం నడుస్తోందంటూ ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇసుక నుంచి మట్టి వరకు అన్నీ దోచేస్తున్నారంటూ డైరెక్టుగా టార్గెట్ చేస్తున్నారు తుమ్మల. ఖమ్మంలో కొత్తగా ట్రాన్స్‌పోర్ట్ మాఫియా కూడా వచ్చిందంటూ అలిగేషన్స్ చేశారు. సామాన్యుడు ఒక ప్లాట్ కొనుక్కుంటే ఎప్పుడు ఎవరు వచ్చి కబ్జా చేస్తారో తెలియక భయంతో బతుకుతున్నారంటూ కొత్త పాయింట్ తీసుకొచ్చారు తుమ్మల. మంత్రి పువ్వాడ అజయ్ కాంట్రాక్టర్లను బెదిరించి, ఆ పనులను వేరే వారికి అమ్ముకున్నారని ఆరోపించారు. ప్రతీ దాంట్లో కమీషన్లు దండుకున్నారని విమర్శించారు. ప్రజల భూములు కబ్జా చేసి కాలేజ్ చుట్టూ ఫెన్సింగ్ వేసి ఎవర్నీ రానివ్వడం లేదన్నారు. ఖమ్మం గుట్టలను మాయం చేసి మట్టి దోచుకున్నారని మండిపడ్డారు తుమ్మల. ఖమ్మంలో అంతా దోచుకునే మురాను తయారు చేశారన్నారు. తాను గెలిస్తే ఈ అరాచకాలు ఉండవు.. దోపిడీ ఉండబోదంటూ హామీ ఇస్తున్నారు.